# కృపా పోరాటము

డా॥ కె. రామారావు

నాకు బాహ్యమైన ఆడంబరాలుగాని, అండదండలుగాని, స్నేహాలు గాని ఏమీ లేవు. కానీ నాకు ఒక రోగం ఉంది. ఖాళీగా వున్నప్పుడు ఆశ్రమాల చుట్టూ తిరిగే అలవాటుంది. వెళ్ళిన ప్రతీచోట చందాలు – సంతర్పణల గోలే!

ఇంతలో ఒక మిత్రుడు తారసిల్లి చెప్పాడు – నీ గురించి! అడగ కుండానే అందరికీ నీవు అన్నీ ఇచ్చే స్వామివనీ! కోపమనే గుణమే లేని అజాతశత్రుడవనీ! చిరునవ్వులతోనే చింతలు బాపే చిన్మయ స్వరూపుడవనీ! నీ ప్రతిమాట ఒక మహామంత్రమేననీ! ఎదుటివారి మనస్సులోని బరువులు – భారాలు వారికి కూడ తెలియకుండానే తీసివేస్తావనీ! మౌనంతోనే అహంకారాన్ని కూల్చి నీ అంతటి వాడిని చేసి ఆత్మ సింహాసనం మీద అధిష్టింపజేస్తావనీ! గుండెలోని మోయలేని బండరాళ్ళను చిరునవ్వుతో చిటికెలో దించివేస్తావనీ! ఒక్కమాటలో చెప్పాలంటే కన్నతల్లిని మించిన ప్రేమను కురిపిస్తావని చెప్పారు.

అలాగైతే ఇప్పుడే నిన్ను చూడాలనిపించింది. వెంటనే నీ దగ్గరకు వచ్చాను. కళ్ళారా చూసాను. నిన్ను చూడటానికి రెండు కళ్ళేకాదు – మరో రెండు కళ్ళు ఉంటే ఎంత బాగుండుననిపించింది. ఏం చూసాను? నీవూ సంతర్పణలే చేస్తున్నావు! ఏమిటా సంతర్పణలు? అన్న సంతర్పణలు కాదులే – జాతి మత కుల లింగ భేదము లేకుండా నిన్ను చూడటానికి వచ్చిన ప్రతీవారికి జ్ఞాన సంతర్పణ చేస్తున్నావు! ప్రేమ ప్రసాదాన్ని పంచిపెడు తున్నావు! కరుణామృతాన్ని కురిపిస్తున్నావు! శాంతిసాగరంలో ముంచి కాలాన్ని మరిపిస్తున్నావు! నీ దర్శనంతో నా జన్మ తరించినదయ్యా!

అందుకే నా అహంకారాన్ని నీకు ఆహారంగా అర్పించాలని నిర్భయంగా నీ చెంతకు వచ్చాను. నీవు రమ్మనలేదులే! నాకై నేనే వచ్చాను – ఎందుకు? ఆపరేషన్ చేసేముందు బాధ తెలియకుండా మత్తుమందు ఇచ్చినట్లు సాధనల పేరుతో శ్రమ పెట్టకుండా నా అహంకారాన్ని తీసివేస్తావనే ఆశతో వచ్చాను. కానీ నీవేం చేశావు? నీ కళ్ళతో నాకు గేలం వేశావు! నీ చూపుల మైకంలో పెట్టి నా కొంప కూల్చావు! గుట్టుగా కొంపలో ప్రశాంతంగా బ్రతికే నన్ను వీధిలోకి ఈడ్చావు. అంతిటితో ఊరుకున్నావా? తేనెలో పడ్డ ఈగలాగ బాగా చిక్కాడు – ఇంకెక్కడికి పోతాడులే అనుకున్నావు? అందుకే మాటామంతీ లేకుండా కళ్ళుమూసుకుని మౌనంగా రాయిలాగా కూర్చున్నావు! ఇలా చేయడం నీకు న్యాయమేనటయ్యా? మోసగాడివని ఈ లోకం నిన్ను నిందిస్తుందయ్యా! ఈ నింద నీకు రానీయక – పెనుతుఫానులో నడిసముద్రములో నావికుడు లేక చిక్కుకున్న నావలాగా నా బ్రతుకును నట్టేట ముంచకయ్యా! నన్నే లక్ష్యంగా పెట్టుకుని నీ అనుగ్రహాన్ని నాపై కురిపించి నన్ను రక్షించవయ్యా!

నేను పూర్తిగా పతనమైపోయిన తరువాతనే నన్ను రక్షించమని ప్రార్థించే పెద్దమూర్ఖుడినేలే – కాదనను. కానీ నీకు అసలు కోపమనే గుణమే లేనివాడివి కదయ్యా! ముక్కు వంకర ఉన్నవాడి చేతికి అద్దమిచ్చి నీ ముక్కు చూసుకోమన్నట్లు

నన్ను హేళన చేయక కరుణించవయ్యా! పక్వానికి రాక పాడైన పండును నీవు మాత్రం ఏం చేసుకుంటావయ్యా? తేనెటీగకు పూవును వికసింపచేసే శక్తిలేక పూవు వికసించేవరకు ఎదురు చూస్తుంటుంది. కానీ నీవు తేనెటీగలాగ శక్తిహీనుడవు కాదు గదయ్యా? నాలో సద్గుణాలు లేనిమాట నిజమేలే - కాదనను! కానీ నీవు సకల సద్గుణ సంపన్నుడివి కదా? నీ కళ్యాణ గుణాలతో నన్ను అలంకరించి యేలుకోవయ్యా! నా మనస్సును మృదువైన పూలపాన్పుగా చేసుకొని నీవు నేను ఒక్కటై రేయిపగలు లేని బట్టబయట నన్ను రమింపజేయ రావయ్యా!

పంచేంద్రియాలనే తుంటరులు నన్ను బయటికి లాగి పాడు చేస్తుంటే - నీవు రక్షింపగల శక్తి ఉండి కూడా అలా చూస్తూ ఊరుకుంటే ఇది నీకు న్యాయమటయ్యా? నీవేదో దేవుడివనీ, నన్నేదో ఉద్ధరిస్తావనీ నాకై నేను వెదుక్కుంటూ ఎంతో శ్రమపడి నీ చెంతకు వస్తే ప్రేమతో నన్ను ఆదరించి హృదయానికి హత్తుకోకుండా నిర్గుణస్థితిలో నిలిచిపోయావేమిటయ్యా? సత్యము తెలియకుండా, జ్ఞానము కలుగకుండా నా తనువు పడిపోతే నాకు జన్మ వచ్చినందుకు లాభమేముందయ్యా? మాయా విషము నా బుర్రకు పట్టి నా బుద్ధిని నాశనము చేయకముందే, నీ జ్ఞానాగ్నిలో నా అజ్ఞానం కాలి బూడిద కాకముందే, జన్మపరంపరలకు మూలమైన నా చిజ్జడగ్రంథిని పూర్తిగా కత్తిరించి కాపాడవలసిన బాధ్యత నీకు లేదా? మా కంటికి వెలుగువు నీవై కన్ను లేకుండానే మాలోని దోషాలను చూడగలిగిన నీకు తెలియనిది ఏముందయ్యా? నా అజ్ఞానము పూర్తిగా అంతమయ్యే వరకు నీ కృపను నా పైన కురిపించకపోతే నేను చెప్పుకోవటానికి నీవు తప్ప నాకు వేరే దిక్కు ఎవరున్నారయ్యా?

నిన్నూ, నన్నూ వేరు చేస్తున్న ప్రకృతి మైకంలో పడి కొట్టుకుపోతున్న నన్ను నీవు అంతకంటే పెద్దభూతమై పట్టుకొని నీ పిచ్చిలో నన్ను పెట్టావు! నీ మీద పిచ్చిని తీసివేయకుండా నీవు "ఛీ" అని ఇప్పుడు నన్ను దూరంగా త్రోసివేస్తే నీకోసం విలపిస్తూ నా తనువు కరిగి కన్నీటేరై నశించిపోతానయ్యా! నాకై నేను వచ్చానని చులకన చేసి విడిచిపెట్టక నా హృదయములో నాట్యము చేయుటమాని అలా బాహ్యంగా తారాడుతూ నన్ను నీలో కలుపుకోకపోతే నేను నశించిపోతానయ్యా! ఈ ఇహపరలాభహీనుని అప్పుడు నీవేం చేసుకుంటావయ్యా! నీ అమృతహస్తంతో నన్ను తాకి పక్వము చేసి నీ స్వరూపములో కలుపుకోకపోతే నిన్ను విడిచి నేను బ్రతకలేనయ్యా!

ఉన్నది నీవు ఒక్కడివేననీ, మేమంతా సున్నేననీ, ఈ సున్నలు అన్నీ కాల గర్భంలో కలిసిపోతాయనీ నాకూ తెలుసు. కానీ ఈ నిజం నా బుద్ధికి అందినదే కానీ - నా గుండెకు అందలేదుగా తండ్రీ? బహుశా నా గుండె తలుపు తెరచుట నీవు మరచిపోయావేమో? భక్తులందరూ తమ హృదయాలలో నిన్ను చూసుకొని శాంతిని పొందుతున్నారట కదయ్యా? కానీ ఆత్మవంచన చేసుకొంటూ భ్రమలో నేను బ్రతకలేను తండ్రీ! 35 సం॥లుగా నిన్ను చూసుకొంటూ నీ చల్లని చూపులలో నన్ను నేనే మరచిపోయి బ్రతికాను. నిన్ను చూడకుండా బ్రతకవలసిన దుర్దినము నాకు రాకూడదని, నీకంటే ముందే నన్ను తీసుకు పొమ్మనే కదయ్యా నోరు తెరచి నిన్ను కోరుకున్నది? నీవూ నేనూ వేరువేరుగా ఉన్నంతకాలము నాకు ఈ వేదన తప్పదుగా తండ్రీ? ఈ బుద్ధులన్నీ కాలి, హద్దులన్నీ దాటి, నీవు నేను ఏకమయ్యేది ఎప్పుడో? ఆ రోజు ఎప్పుడో?